సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 21 । ఆగస్టు । 2023



పచ్చందాలకు ప్రణాళిక


కాకినాడ నగరం నడిమధ్యలో దాదాపు 100 ఎకరాలకు పైబడిన విస్తీర్ణంలో ఉన్న జేఎన్‌టీయూకేలో సరికొత్త ప్రాజెక్టుకు అడుగులు పడుతున్నాయి. - 8లో



ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల షటిల్ బ్యాడ్మింటన్ మెన్ డబుల్స్, 45+ డబుల్స్ విభాగాల్లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల క్రీడాకారులు తమ ప్రతిభ చూపారు. -8లో

డెల్టాలకు 11,100 క్యూసెక్కులు



ధవళేశ్వరం: సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నుంచి మూడు డెల్టా కాలువలకు ఆదివారం 11,100 క్యూసెక్కుల గోదావరి జలాలు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 4,500, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

శ్రీబాల బాలాజీ స్వామికి రూ.1.60 లక్షల ఆదాయం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ట్రస్టుబోర్డు సభ్యులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామికి ఆదివారం రూ.1.60 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.97,550 ఆదాయం వచ్చిందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి తెలిపారు. నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.63,383 చెల్లించారన్నారు. 2,864 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా 2,136 మంది అన్న ప్రసాదం స్వీకరించారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం క్రాపవరానికి చెందిన గూడూరి శ్రీనివాసరావు, ధానేశ్వరి దంపతులు స్వామివారి నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.15,111 విరాళంగా చెల్లించారు. వారికి ఆలయ ధర్మకర్తలు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్ స్వామి వారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం అందజేశారు.

రోడ్ల ఆధునీకరణకు రూ.32 కోట్లు



ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

మామిడికుదురు: పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలో పాడైపోయిన అయిదు ఆర్‌అండ్‌బీ రహదారుల ఆధునీకరణకు రూ.32 కోట్లు మంజూరు చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆదివారం తెలిపారు. సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) ద్వారా ఈ నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఆయన స్థానిక విలేకర్లకు నిధులు మంజూరైన రోడ్ల వివరాలు తెలిపారు. రూ.32 కోట్లతో 18.765 కిలోమీటర్ల మేర అయిదు రహదారులను తీర్చిదిద్దుతామన్నారు. అంబాజీపేట నుంచి పి.గన్నవరం వరకు 0.00 కిలోమీటరు నుంచి 6.595 కిలోమీటరు వరకు, అంబాజీపేట నుంచి పుల్లేటికుర్రు వరకు 8.40 నుంచి 9.60 కిలోమీటరు వరకు రెండు రోడ్లకు నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు. పి.గన్నవరం నుంచి బెల్లంపూడి వరకు 0.00 కిలోమీటరు నుంచి 4.80 కిలోమీటరు వరకు, యర్రంశెట్టివారిపాలెం నుంచి నరేంద్రపురం వరకు 0.00 కిలోమీటరు నుంచి 2.320 కిలోమీటరు వరకు రోడ్డుకు, ముక్కామల లాకు నుంచి మడుపల్లి వరకు 0.00 కిలోమీటరు నుంచి 3.85 కిలోమీటరు వరకు రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే చిట్టిబాబు తెలిపారు. త్వరలోనే ఈ అయిదు రోడ్ల అభివృద్ధి పనులు చేపడతారని చెప్పారు.

నేడు యథావిధిగా స్పందన

అమలాపురం రూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాలు సోమవారం యథావిధిగా జరుగుతాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయిలోను, ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయిలో, తహసీల్దార్ల కార్యాలయాల్లో గ్రామ, వార్డు సచివాలయాలలో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని వివరించారు. అధికారులు అందరూ సోమవారం ఉదయం 10 గంటల నుంచే ఫిర్యాదులను స్వీకరిస్తారని, గ్రామ వార్డు సచివాలయాల్లో మాత్రం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య విజ్ఞాపనలు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మరోసారి వేమా



వేమాను సత్కరిస్తున్న నాయకులు

అమలాపురం రూరల్: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మరోసారి కోనసీమకు చెందిన మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమాను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. వేమాను ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షుడు దూరి రాజేష్ సత్కరించారు. బీజేవైఎం నాయకులు కొండేటి ఈశ్వర్ గౌడ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు శివాజీ, పట్టణ ప్రధాన కార్యదర్శి అరిగెల తేజ వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు నందూరి శ్రీరామ్, జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ చీకరమేల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫ్యాన్‌టాస్టిక్ గెలుపు



ఓదూరులో సర్పంచ్ వింజుమళ్ల విమలకుమారిని అభినందిస్తున్న నాయకులు



వింజుమళ్ల విమలకుమారి, సర్పంచ్, ఓదూరు, రామచంద్రపురం మండలం, మెజారిటీ: 335 ఓట్లు



రుద్రరాజు పవిత్ర, సర్పంచ్, గోడిలంక, అల్లవరం మండలం (ఏకగ్రీవం)

- సర్పంచ్ పదవులతోపాటు.. వార్డు పదవులూ కైవసం
- ఓదూరు సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ మద్దతు అభ్యర్థికి ఒకే ఒక్క ఓటు!

సాక్షి అమలాపురం: స్థానిక సంస్థల్లో కీలకమైన పంచాయతీ ఎన్నికలలో వైఎస్సార్ సీపీ సత్తా చాటింది. జిల్లాలో వివిధ కారణాలతో సర్పంచ్‌లకు, వార్డు సభ్యుల పదవులకు జరిగిన ఉప ఎన్నికలలో అధికార వైఎస్సార్ సీపీ తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకుంది. ఏకగ్రీవాలలోనూ, ఎన్నికల జరిగిన చోట కూడా మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుంది. ప్రతిపక్ష టీడీపీ సర్పంచ్ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని మూటగట్టుకోగా, వార్డు ఎన్నికల్లో టీడీపీ, జనసేన అరకొర విజయాలతో ఉనికిని చాటుకున్నాయి.

జిల్లాలోని రెండు పంచాయతీ సర్పంచ్ పదవులకు ఎన్నికలు జరిగాయి. వీటిలో అల్లవరం మండలం గోడిలంక పంచాయతీ సర్పంచ్ పదవి ఏకగ్రీవమయ్యింది. వైఎస్సార్ సీపీ మద్దతుతో రుద్రరాజు పవిత్ర ఇక్కడ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక రామచంద్రపురం మండలం ఓదూరు గ్రామ సర్పంచ్ పదవికి శనివారం ఎన్నికలు జరగాయి. వైఎస్సార్ సీపీకి చెందిన వింజుమళ్ల విమలకుమారి 335 ఓట్ల మెజారిటీతో ఇదే పార్టీకి చెందిన బుంగా బుల్లమ్మాయిపై విజయం సాధించారు. ఇక్కడ జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున ఇద్దరు పోటీలో ఉండగా, టీడీపీ మద్దతుతో ఇద్దరు రంగంలో ఉండడం విశేషం. టీడీపీ మద్దతుతో పోటీచేసిన అభ్యర్థులకు డిపాజిట్లు రాలేదు. పోటీలో ఉన్న తాతపూడి గంగా భవానికి 34 ఓట్లు రాగా, కోనాల అనంతలక్ష్మికి కేవలం ఒకే ఒక్క ఓటు రావడం గమనార్హం. ఒక్క ఓటు సాధించిన అనంతలక్ష్మి తరఫున గ్రామంలో ఆ పార్టీ నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మితోపాటు పలువురు విస్తృతంగా ప్రచారం చేశారు. 34 ఓట్లు సాధించిన తాతపూడి గంగాభవాని తరఫున ఆ పార్టీ నాయకులు చింతపల్లి వీరభద్రరావు, మేడిశెట్టి రవికుమార్, కడియాల రాఘవన్, చింతపల్లి అర్జున్, గుణ్ణం వినోద్‌కుమార్‌లు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తే ఇద్దరికీ కలిపి కేవలం 35 ఓట్లు రావడం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని తెలియజేస్తోంది. పార్టీకి నియోజకవర్గ స్థాయిలో నడిపించే నాయకుడు లేకపోవడం, స్థానిక క్యాడర్ నిర్లిప్తతతో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది.



వార్డుల్లోనూ అదే జోరు

పంచాయతీ వార్డులకు జరిగిన ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ హవా కొనసాగింది. జిల్లాలో మొత్తం 21 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, 15 ఏకగ్రీవం అయ్యాయి. వీటిలో వైఎస్సార్ సీపీ 8 వార్డులు గెలుచుకోగా, టీడీపీ, జనసేన పార్టీలు చెరో మూడు చొప్పున ఏకగ్రీవంగా గెలుచుకున్నాయి. ఒకచోట స్వతంత్రం అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక పోటీ జరిగిన ఆరు వార్డులకు గాను వైఎస్సార్ సీపీ నాలుగు, టీడీపీ, జనసేన చెరో ఒకటి చొప్పున గెలుచుకున్నాయి. మొత్తం వార్డులలో వైఎస్సార్ సీపీ 12 వార్డులు గెలుచుకోగా, టీడీపీ, జనసేనలు చెరో నాలుగు, స్వతంత్రంగా ఒకరు చొప్పున గెలిచారు. టీడీపీ, జనసేన వార్డులు గెలిచిన చోట గతంలో వారి కుటుంబ సభ్యులు చనిపోవడంతో సానుభూతితోనూ, మరి కొన్ని చోట్ల పొత్తులు పెట్టుకోవడం ద్వారా గెలవడం విశేషం.

సంక్షేమ, అభివృద్ధి పనులకు దక్కిన విజయం

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఈ ఎన్నికల తీర్పు అద్దం పడుతోంది. టీడీపీ, జనసేన దొడ్డిదారిన పొత్తులు పెట్టుకుని ఒకరికి ఒకరు మద్దతు ఇచ్చుకున్నా ఫలితాలు అనుకూలంగా రాకపోవడం విశేషం. సాధారణ ఎన్నికల దగ్గర పడుతున్న తరుణంలో జిల్లాలోని వివిధ నియోజకవర్గాల పరిధిలో జరిగిన ఈ ఎన్నికలు ఒక విధంగా సెమీఫైనల్స్ లాంటివి. వీటిలో అధికార వైఎస్సార్ సీపీ ఏకంగా 66 శాతం విజయాలు సొంతం చేసుకోవడం గమనార్హం.

సామూహిక శ్రీ గాయత్రీ మంత్ర జపం



అమలాపురంలో సామూహిక శ్రీ గాయత్రీ మంత్ర జపం చేస్తున్న బ్రాహ్మణులు

అమలాపురం టౌన్: స్థానిక సుబ్బారాయుడి చెరువు వద్ద గల శ్రీ చంద్ర మౌళీశ్వరస్వామి దేవాలయంలో వంద మందికి పైగా బ్రాహ్మణులు ఆదివారం సామూహిక శ్రీ గాయత్రీ మంత్ర జపం నిర్వహించారు. సనాతన ధర్మ వ్యాప్తికి, లోక కల్యాణం కోసం దేశ వ్యాప్తంగా పలు దేవాలయాల్లో సామూహిక మంత్ర జపాలు జరుగుతున్నాయని సంధ్యా వందన అభ్యసన శిక్షణ సమితి వ్యవస్థాపకులు, గురుదేవులు కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా కల్వకొలను చిత్తరంజన్ దాస్ స్మారక సేవా సంస్థకు ఆధ్యాత్మిక అనుబంధ సంస్థ సంధ్యా వందన అభ్యసన శిక్షణ సమితి ఆధ్వర్యంలో 2024 జూలై నెలలో అయోధ్యలో నిర్వహించబోయే 'శతకోటి గాయత్రీ మంత్ర జప యజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆదివారం దేశంలోని పలు దేవాలయాల్లో ఈ సామూహిక మంత్ర జపాలు నిర్వహించారని శ్రీరామచంద్రమూర్తి వివరించారు. సంస్థ జిల్లా ప్రతినిధి మిర్తిపాటి వేంకట రామయ్య మాట్లాడుతూ గాయత్రీ మంత్రం విశిష్టత, శతకోటి గాయత్రీ మంత్ర జప విధానం, సంస్థ చేపట్టిన ఇంటింటా రామాయణం పారాయణ గురించి వివరించారు. కార్యక్రమంలో శ్రీకోనసీమ వేద శాస్త్ర సన్మాన సభ ప్రతినిధి గుళ్లపల్లి వెంకట్రామ్, నిమషకవి బాల సుబ్రహ్మణ్యం, మిర్తిపాటి జోగయ్యశర్మ, బులుసు వ్యాఘ్రేశ్వరుడు ప్రసంగించారు.

శ్రీనివాస్ ఫొటోకు ఉత్తమ పురస్కారం



అవార్డుకు ఎంపికైన ఉత్తమ చిత్రం



శ్రీనివాస్‌ను అవార్డుతో సత్కరిస్తున్న ప్రముఖులు

సఖినేటిపల్లి: మండల పరిధిలోని అప్పనరామునిలంకకు చెందిన ఫొటోగ్రాఫర్ నల్లి శ్రీనివాస్ తీసిన ఫొటోకు ఉత్తమ చిత్రం అవార్డు దక్కింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏపీ ఫొటోగ్రఫీ సొసైటీ ఆధ్వర్యాన జాతీయ స్థాయిలో నిర్వహించిన ఫొటోల ఎగ్జిబిషన్‌కు 175 ఫొటోస్ రాగా, 30 ఫొటోలు ఎంపిక అయ్యాయి. వీటిలో కేశనపల్లి–తూర్పు పాలెంలో శ్రీనివాస్ తీసిన మెగా డ్రెయిన్‌లో దోనెపై జాతీయ జెండాతో వేటకు వెళుతున్న వేటగాడు ఫొటోకు ఉత్తమ చిత్రం అవార్డు వచ్చింది. వివరాలు శ్రీనివాస్ ఆదివారం మీడియాకు చెప్పారు. విజయవాడలో ఈ నెల 18న ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, డైరెక్టర్ నేషనల్ మెడికల్ కమిషన్ జేబీరావు, ఏపీ మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, గోళ్ళ నారాయణరావు చేతుల మీదుగా శ్రీనివాస్‌కు సన్మానం చేసి, ఉత్తమ జాతీయ చిత్రం అవార్డు బహూకరించారు.

దిశ కాల్‌తో ఆకతాయి ఆటకట్టు

నిమిషాల్లో బాధిత యువతికి రక్షణగా నిలిచిన పోలీసులు

అమలాపురం టౌన్: ఆదివారం రాత్రి 8.15 గంటలు.. అమలాపురం మోబర్లీపేట వద్ద ఆపదలో ఉన్న ఓ యువతి 'దిశ'కు ఫోన్ కాల్ చేసింది. ఓ వ్యక్తి తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడన్నది ఆ కాల్ సారాంశం. కాల్‌ను అందుకున్న అమలాపురం పోలీసులు డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆధ్వర్యంలో తక్షణమే ఆ యువతి ఉన్న ప్రదేశానికి వెళ్లారు. పట్టణ పోలీసు కానిస్టేబుల్ ఎం.రామకృష్ణ ఆ యువతికి అండగా నిలిచి ధైర్యం చెప్పారు. ఆ వెంటనే ఆమెను వేధిస్తున్న వ్యక్తిని పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తీసుకుని వచ్చి అతనిపై తగిన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆపద నుంచి బయట పడిన యువతి తాను దిశకు కాల్ చేసిన కొన్ని నిమిషాల్లోనే పోలీసులు నా వద్దకు వచ్చి రక్షణగా నిలిచినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. కాల్ అందుకున్న పోలీసులు వేగంగా స్పందించి యువతిని రక్షించినందుకు పట్టణ పోలీసులను జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్, డీఎస్పీ అంబికా ప్రసాద్ అభినందించారు.

రత్నగిరిపై పెళ్లి సందడి

- మళ్లీ మొదలైన వివాహాలు
- నవ దంపతులతో కిటకిటలాడిన ఆలయం
- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- రూ.40 లక్షల ఆదాయం



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు, నవదంపతులు

అన్నవరం: సుమారు రెండు నెలల విరామం అనంతరం రత్నగిరిపై పెళ్లి సందడి మళ్లీ ఆరంభమైంది. నవదంపతులు, వివాహ బృందాలు, వేలాదిగా వచ్చిన భక్తులతో సత్యదేవుని ఆలయం ఆదివారం కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పెద్ద సంఖ్యలో భక్తులు రత్నగిరికి వస్తూనే ఉన్నారు. ఆలయ ప్రాంగణం, క్యూ లైన్లు, వ్రత మండపాలు భక్తులతో నిండిపోయాయి. శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున రత్నగిరిపై సుమారు 50 పెళ్లిళ్లు జరిగాయి. ఇవే ముహూర్తాల్లో ఇతర ప్రాంతాల్లో కూడా పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవదంపతులందరూ తమ బంధుమిత్రులతో కలసి సత్యదేవుని ఆలయానికి తరలి వచ్చారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి, పూజలు చేశారని అధికారులు తెలిపారు. వ్రతాలు 2,500 జరిగాయి. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రదక్షిణ దర్శనానికి గంట చొప్పున సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్త గోకులంలో ఆవులకు ప్రదక్షణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో 4 వేల మందికి భోజనం పెట్టారు. వచ్చే నెల 15వ తేదీ వరకూ పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో అధిక సంఖ్యలో వివాహాలు జరిగే అవకాశం ఉండటంతో రానున్న రోజుల్లో భక్తుల రద్దీ కొనసాగనుంది. ఈ శ్రావణ మాసంలో సుమారు వెయ్యి వివాహాలు జరిగే అవకాశం ఉందని పండితులు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కిక్కిరిసిన అయినవిల్లి



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో అభిషేకాలకు హాజరైన భక్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొల్పు సేవ నిర్వహించారు. అనంతరం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి లఘు న్యాస అభిషేకాల్లోను, లక్ష్మీగణపతి హోమంలోనూ భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి గరిక పూజ జరిపారు. పంచామృత అభిషేకం, ప్రత్యేక అభిషేకాల్లో 49 మంది భక్తదంపతులు, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 430 మంది భక్తులు, శ్రీ లక్ష్మీ గణపతి హోమంలో 43 మంది భక్త దంపతులు, 27 మంది చిన్నారులకు నామకరణం, అక్షరాభ్యాసం, అన్నప్రాసన, తులాభారం వంటివి నిర్వహించారు. స్వామికి తొమ్మిదిమంది తలనీలాలు సమర్పించారు. 28 మంది నూతన వాహనాలకు పూజ నిర్వహించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,99,513 లభించిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

స్వగృహమస్తు



రాయవరం మండలం సోమేశ్వరంలో జగనన్న కాలనీ

- జిల్లాలో చురుగ్గా ఇళ్ల నిర్మాణాలు
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- పలు దశల్లో 24,161 ఇళ్లు
- 7,700 సామూహిక గృహ ప్రవేశాలకు సన్నాహాలు

రాయవరం: సొంత ఇల్లు అనేది ప్రతి ఒక్కరి కల. అయితే ధనవంతులకు ఇళ్లు నిర్మించుకోవడం కష్టం కాకపోయినా..ప్రస్తుత రోజుల్లో పేదలకు సొంతిల్లు నిర్మించుకోవడం కష్టమైన పని. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను సాకారం చేశారు. అర్హులైన పేదలందరికీ స్థలం మంజూరు చేసి, ఇంటి నిర్మాణాలను ప్రభుత్వం ప్రోత్సహించింది. దీనిలో భాగంగా పెద్ద ఎత్తున సామూహిక గృహ ప్రవేశాలు చేయించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అధిక సంఖ్యలో గృహ ప్రవేశాలు చేయించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో హౌసింగ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

సకల సదుపాయాలతో..

పేదలందరికీ ఇళ్లు పథకం కింద అర్హులందరికీ స్థలాలను మంజూరు చేయడంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 1,808 ఎకరాలను సేకరించి 243 జగనన్న లేఅవుట్లుగా తీర్చిదిద్ది మౌలిక సదుపాయాలను అధికారులు కల్పిస్తున్నారు. జగనన్న లేఅవుట్లకు ప్రభుత్వం నుంచి 606 ఎకరాలు సేకరించగా, ప్రభుత్వం ప్రైవేటుగా 1,202 ఎకరాలను రూ.728.88 కోట్లను వెచ్చించి కొనుగోలు చేసింది. తొలుతగా లో లెవల్‌గా ఉన్న జగనన్న లేఅవుట్లలో లెవిలింగ్ పనులు పూర్తి చేశారు. అనంతరం నూతనంగా ఏర్పడిన కాలనీలకు అప్రోచ్ రోడ్లు, ఇంటర్నల్ రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. ప్రతీ లబ్ధిదారుడి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఉచితంగా అందజేస్తోంది. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు డ్వాక్రాలో సభ్యులుగా ఉంటే వారికి డ్వాక్రా సంఘం ద్వారా రూ.35 వేలు సాయం అందజేస్తోంది. జిల్లాలో డ్వాక్రా మహిళలుగా ఉంటూ ఇళ్లు నిర్మించుకునే 19,908 మంది లబ్ధిదారులకు రూ.69.67 కోట్లను రుణంగా అందజేశారు. ఇళ్లను నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేని లబ్ధిదారులకు రూ.20వేలు అడ్వాన్స్‌ను రుణంగా మంజూరు అయ్యే సొమ్ము నుంచి ఇప్పించేందుకు కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధంగా ప్రభుత్వం ఇంటి నిర్మాణం నిమిత్తం లబ్ధిదారులకు అన్ని విధాలుగా అండగా నిలబడింది.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 243 లేఅవుట్లలో 73,895 మంది అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు అందించారు. పట్టాలు పొందిన లబ్ధిదారుల్లో ఇప్పటి వరకు 24,161 మంది ఇళ్లను నిర్మించుకుంటున్నారు. లబ్ధిదారుల అనుమతితో ఆప్షన్–3 కేటగిరి కింద 2,676 ఇళ్ల నిర్మాణం జరుగుతుండగా, 21,485 మంది స్వంతంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఇప్పటి వరకు 7,659 మంది లబ్ధిదారులు ఇళ్లను పూర్తి స్థాయిలో నిర్మించుకున్నారు. అయితే ఈ నెలాఖరుకు 7,700 మంది లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించడాన్ని జిల్లా అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇదిలా ఉంటే బేస్‌మెంట్ లెవెల్‌లో 8,398, బేస్‌మెంట్ స్థాయిలో 6,457, రూఫ్ స్థాయిలో 1,178, రూఫ్‌కాస్ట్‌లో 469 ఇళ్లు ఉన్నాయి.

త్వరలో సామూహిక గృహ ప్రవేశాలు

రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులతో త్వరలో సామూహిక గృహ ప్రవేశాలు చేయించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల గృహ ప్రవేశాలు లక్ష్యంగా నిర్ణయించగా, జిల్లాలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న 7,700 లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేపట్టడాన్ని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా నిర్దేశించుకుంది. రాయవరం మండలం సోమేశ్వరం గ్రామంలో నూతనంగా ఏర్పాటైన జగనన్న కాలనీలో సామూహిక గృహ ప్రవేశాలను ఒక పండగ వాతావరణంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఈ నెల 18న సోమేశ్వరంలోని జగనన్న కాలనీని సందర్శించారు. సామూహిక గృహ ప్రవేశాలకు అవసరమైన ఏర్పాట్లలో గృహ నిర్మాణ శాఖ నిమగ్నమైంది.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



ఇళ్లు నిర్మించుకునేందుకు స్థలం ఇవ్వడమే కాకుండా ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రుణం మంజూరు చేసింది. మా లేఅవుట్‌లో అధిక సంఖ్యలో ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. అందరి ఇళ్ల నిర్మాణంతో ఇప్పుడు ఒక కాలనీ ఏర్పడింది. సొంతింటి కలను నెరవేర్చిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– కేతా దేవి, లబ్ధిదారు, సోమేశ్వరం, రాయవరం మండలం

అద్దె ఇంటి బాధలు తప్పుతాయి



జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రుణం మంజూరు చేయడంతో సొంతిల్లు ఏర్పడింది. చాలాకాలంగా అద్దె ఇంట్లో ఉంటూ పడ్డ ఇబ్బందులు తొలగినట్టయింది. ఈ ప్రభుత్వం చేసిన మేలును మర్చిపోలేం.

– మేడిశెట్టి ప్రవీణ, లబ్ధిదారు, ఈతకోట, రావులపాలెం మండలం

హౌసింగ్ చరిత్రలో ఇదే ప్రథమం



ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. ఇంత భారీ స్థాయిలో పట్టాలు ఇవ్వడం, అలాగే ఇళ్ల నిర్మాణం చేపట్టడం హౌసింగ్ శాఖ చరిత్రలో ఇదే ప్రథమం. కలెక్టర్ హిమాన్షు శుక్లా ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కలెక్టర్ పర్యవేక్షణలో ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా చేపడుతున్నాం. ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం లబ్ధిదారులకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది.

– సీహెచ్ బాబూరావు, పీడీ, గృహ నిర్మాణ శాఖ, అమలాపురం

క్లుప్తంగా

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ప్రకాశం నగర్ : జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గౌతమి స్మార్ట్ స్కూల్‌లో జిల్లా చదరంగం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అండర్ 15 బాల బాలికల విభాగంలో నాలుగు రౌండ్లలో జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో విష్ణు సాయి, రామ్ చరణ్ తేజ, సీతాసాగర్, సాకేత్‌లు విజయం సాధించగా, బాలికల విభాగంలో తేజ శ్రీ, ఆద్య, సమన్విత, ట్విషలు విజయం సాధించారు. విజేతలు ఈ నెల 24 నుంచి 27 వరకు అనంతపురంలో జరిగే చదరంగం రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనబోతున్నారని అసోసియేషన్ కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు.

సీడబ్ల్యూసీలో పళ్లంరాజు


కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు

కాకినాడ: సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితునిగా కేంద్రమాజీ మంత్రి, కాకినాడ మాజీ ఎంపీ మల్లిపూడి మంగపతి పళ్లంరాజు నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్ర నాయకత్వం ఆదివారం ఆయన నియామకాన్ని ప్రకటించింది. కాకినాడ ఎంపీగా, కేంద్ర రక్షణశాఖ, మానవ వనరులశాఖ అభివృద్ధి మంత్రిగా ఆయన వివిధ హోదాల్లో పనిచేశారు. పీసీసీ సమన్వయ కమిటీ సభ్యునిగా కూడా పనిచేశారు. ఆయన కుటుంబానికి మూడు తరాలుగా కాంగ్రెస్ పార్టీతో ఉన్న అనుబంధం నేపథ్యంలో పళ్లంరాజుకు ఈ పదవి దక్కింది. ఆయన నియామకం పట్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, ఏఐసీసీ సభ్యులు మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు హర్షం వెలిబుచ్చారు.

వీఆర్‌కు కడియం ఎస్సై

కడియం: స్థానిక ఎస్సై శివాజీని ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపించారు. ఒక కేసు విషయమై దళిత యువకుడు వి.వెంకట ప్రసాద్‌పై దాడి చేశారన్న ఆరోపణలను ఆయన ఎదుర్కొంటున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై శివాజీపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు కూడా నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయనను వీఆర్‌లో ఉంచినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

పచ్చందాలకు ప్రణాళిక

- జేఎన్‌టీయూకేలో ఆహ్లాదకర వాతావరణం దిశగా అడుగులు
- సునీల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5కోట్ల సీఎస్ఆర్ నిధులు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యావేత్తలు
- 23న శంకుస్థాపన


జేఎన్‌టీయూకే క్యాంపస్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కళాశాల నుంచి వర్సిటీ స్థాయికి ఎదిగి నగర నడిమధ్యలో దాదాపు 100 ఎకరాలకు పైబడిన విస్తీర్ణంలో ఉన్న జేఎన్‌టీయూ కాకినాడలో సరికొత్త ప్రాజెక్టుకు అడుగులు పడుతున్నాయి. కార్పొరేట్ కళాశాలల్లో మాత్రమే ఉండే సరికొత్త మౌలిక సదుపాయాలు ఇక జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలకు సమకూరనున్నాయి. కళాశాల నుంచి వర్సిటీగా అప్‌గ్రేడ్ అయి విశాలమైన స్థలంతో దానికి తగిన వనరులు అందుబాటులో ఉన్ననాడు నిర్లక్ష్యం చేశారు. ప్రముఖ కార్పొరేట్ సంస్థలు ఐటీసీఎల్, ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు కేటాయిస్తామన్నా దీనిపై దృష్టి పెట్టినవారు లేరు. అయితే ప్రస్తుతం దాతల సహాయంతో మియావాకి ఫారెస్ట్, నక్షత్ర వనం, జంగిల్ రీడింగ్ బుక్ వంటి పర్యావరణ ప్రాజెక్టులు మరింత గ్రీనరీగా తయారు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గత నెలలో స్నాతకోత్సవానికి విచ్చేసిన గ్రీన్‌కో ఫౌండర్ చలమలశెట్టి అనిల్‌కు వీసీ డాక్టర్ ప్రసాదరాజు దీనిపై ప్రతిపాదించగా సునీల్ చారిటబుల్ ట్రస్ట్ నుంచి వర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.5కోట్లు మంజూరు చేస్తామని చెప్పారు.

చేపట్టే పనులు ఇవే...

ఈ నిధులతో వర్సిటీలో భారీ వృక్షాల చుట్టూ ప్లాట్‌ఫారంలు, రోడ్డు కిరువైపులా ఫుట్‌పాత్ లైటింగ్స్, ఓపెన్ థియేటర్, పార్కు, ఆర్నమెంటల్ ట్రీస్, 2 వాటర్ బాడీస్, యోగా సెంటర్, ఓపెన్ జిమ్ వంటివి ఏర్పాటు చేసి నగరంలో సుందరమైన, స్ఫూర్తిదాయక ప్రాంతంగా రూపొందించడానికి ప్రణాళికలు రూపొందించారు. గత వారం వీసీ సమావేశపు హాల్లో దీనికి సంబంధించి ఇంజినీరింగ్, వర్సిటీ అధికారులు గ్రీన్‌కో ఆర్కిటెక్ టీమ్ ద్వారా ప్రజంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ నెల 23 నుంచి ప్రారంభయ్యే పనులు 2024 ఏప్రిల్‌కు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రెండేళ్ల పాటు గ్రీన్‌కో ట్రస్టు ఉచితంగా నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తుంది.

పర్యావరణానికి ప్రాధాన్యం



వర్సిటీలో పర్యావరణాన్ని పెంపొందించి గ్రీన్ క్యాంపస్‌గా తయారు చేయాలనేది లక్ష్యం. వర్సిటీకి శాశ్వతంగా ఉండే విధంగా భారీ ప్రాజెక్టు చేపట్టాలని ఆశయంగా పెట్టుకున్నాను. సునీల్ ట్రస్ట్‌ను సంప్రదించగా వారికి ఉన్న గ్రీన్‌కో సంస్థ ద్వారా రూ.5కోట్లు కేటాయించడం సంతోషంగా ఉంది. ఉన్నత అధికారులతో వర్సిటీ 15వ వ్యవస్థాపక రోజైన ఈ నెల 23న శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నాము.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, వీసీ, జేఎన్‌టీయూకే

నవోదయ దరఖాస్తులకు గడువు పెంపు

బిక్కవోలు: జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఎంఈవో సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి 20న నిర్వహించే పరీక్షకు ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతిభచాటిన విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి చేరడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

700 క్యూసెక్కుల సాగునీరు విడుదల

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నంలోని తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి 700 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశామని జలవనరుల శాఖ డీఈ వెంకట్రావు ఆదివారం తెలిపారు. పుష్కర-1 నుంచి రెండు మోటారు, పుష్కర-2 నుంచి రెండు మోటార్ల ద్వారా మెట్ట ప్రాంతానికి సాగునీటిని విడుదల చేశామన్నారు. గోదావరి నీటిమట్టం 17.2 మీటర్లు ఉందన్నారు. డిమాండ్‌ను బట్టి పై అధికారుల సూచనల మేరకు సాగునీటి విడుదల పెంచుతామని ఆయన వివరించారు.

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు


పలు విభాగాల్లో విజేతలకు బహుమతులు అందించిన ఎస్పీ శ్రీధర్, డీఆర్వో సత్తిబాబు తదితరులు


ఉభయ తెలుగు రాష్ట్రాల బ్యాడ్మింటన్‌లో మెన్ డబుల్స్‌లో విజేతలైన క్రీడాకారులకు బహుమతులు అందజేసిన ఎస్పీ శ్రీధర్, డీఆర్వో సత్తిబాబు తదితరులు

- మూడు రోజులు జరిగిన టోర్నీ
- హోరాహోరీగా తలపడ్డ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల క్రీడాకారులు
- పలు విభాగాల్లో విజేతలుగా నిలిచిన హైదరాబాద్ క్రీడాకారులు
- మెన్ డబుల్స్, 45 ప్లస్ డబుల్స్‌లో పోటీ

సాక్షి అమలాపురం: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల షటిల్ బ్యాడ్మింటన్ మెన్ డబుల్స్, 45 ప్లస్ డబుల్స్ విభాగాల్లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల క్రీడాకారులు తమ ప్రతిభ చూపారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో రెండు రాష్ట్రాలకు చెందిన జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. వీరి ప్రతిభతో జిల్లా కేంద్రమైన అమలాపురంలోని ఆఫీసర్స్ క్లబ్ క్రీడామైదానం మురిసింది. ఫైనల్స్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. హైదరాబాద్‌కు చెందిన క్రీడాకారులు పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. మెన్ డబుల్స్‌లో కె.సాయి పవన్ (హైదరాబాద్), చంద్ర గోపినాథ్ (గుంటూరు) జోడీ విజేతగా నిలువగా, జి.సుదీశ్ వెంకట్, ఎస్.కార్తీక్ (హైదరాబాద్)లు ద్వితీయ స్థానంలో నిలిచారు. మూడవ స్థానంలో పీజేసాయిసునీల్, బీఎల్ సతీష్ (అమలాపురం), సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం (బాలు) (అమలాపురం), వై.వంశీ (వైజాగ్) జోడీ నిలిచింది. 45 ప్లస్ డబుల్స్‌లో వి.ఉదయ్‌భాస్కర్, జి.సూరిబాబు (విశాఖపట్నం) జోడీ విజేతగా నిలిచింది. ఆకుల వెంకట రాజు (సునీల్) (హైదరాబాద్), బీవీఎస్‌కే లింగేశ్వరరావు (విశాఖపట్నం)లు ద్వితీయ స్థానంలో నిలువగా, డి.సునీల్ (విజయవాడ), పీఎస్‌వీ జగన్ (తుని) జోడి, సత్తి చిన్నారి(కాకినాడ), పీజీ గారు (పిఠాపురం)జోడీలు తృతీయ స్థానాల్లో నిలిచాయి. కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, ఆఫీసర్స్ క్లబ్ సంయుక్తంగా పోటీలను దివంగత క్రీడాకారుడు సాధనాల శ్రీనివాసరావు (వాసు) పేరు మీద నిర్వహించారు. ఆయా విభాగాల్లో విజేతలకు నగదు బహుమతి రూ.1.60 లక్షలు, ట్రోఫీలు అందజేశారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఎస్పీ ఎస్.శ్రీధర్‌లు బహుమతులు అందజేశారు. టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మెట్ల వెంకట సూర్యనారాయణ, కల్వకొలను బాబు, రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్, ఆల్లాడి శరత్, మెట్ల రమణబాబు, గోకరకొండ నాగేంద్ర పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్‌లో హేమంత్ ప్రతిభ


హేమంత్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

నిడదవోలు : జాతీయ స్థాయి బ్యాడ్మింటన్‌లో అత్యంత ప్రతిభ చూపుతున్న నిడదవోలు పట్టణానికి చెందిన సమ్మెట్ల హేమంత్‌ను ఆదివారం ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు అభినందించారు. బిహార్, భువనేశ్వర్, గయలలో ఇటీవల జరిగిన అండర్-13 ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో హేమంత్ మూడు బంగారు పతకాలు సాధించాడు. దీంతో ఆల్‌ఇండియా బ్యాడ్మింటన్ అసోసియేషన్ హేమంత్‌కు నెంబర్‌వన్ ర్యాంక్ ప్రకటించింది. తణుకు చిట్లూరి సుబ్బారావు, గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో హేమంత్ శిక్షణ తీసుకుంటున్నాడు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హేమంత్‌తో కోచ్ అయిన అతని తండ్రి, పీఈటీ సతీష్‌బాబు ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. బ్యాడ్మింటన్‌లో మరింత ప్రతిభ చూపి నిడదవోలు పేరును జాతీయ స్థాయిలో తీసుకురావాలని ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు ఆకాంక్షించారు.

రత్నగిరి సబ్‌స్టేషన్ నుంచి టెక్నికల్ చార్జింగ్


రత్నగిరిపై 33 కేవీ సబ్‌స్టేషన్ టెక్నికల్ చార్జింగ్ చేస్తున్న ఏపీఈఆర్‌సీ చైర్‌పర్సన్ జస్టిస్ నాగార్జునరెడ్డి, ఇతర అధికారులు

అన్నవరం: రత్నగిరి శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో రూ.5.43 కోట్ల వ్యయంతో నిర్మించిన 33 కేవీ ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి దేవస్థానానికి టెక్నికల్ చార్జింగ్‌ను ఏపీఈఆర్‌సీ చైర్‌పర్సన్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. నిత్యం వేలాది మంది భక్తులు విచ్చేసే అన్నవరం దేవస్థానానికి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు గాను ఏపీఈపీడీసీఎల్ కేవలం ఆరు నెలల వ్యవధిలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించిందని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు తెలిపారు. రత్నగిరికే కాకుండా అన్నవరం గ్రామానికి కూడా ఈ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తామని తద్వారా లో వోల్టేజ్ సమస్య తీరుతుందని తెలిపారు. దేవస్థానం కోరిన వెంటనే సబ్‌స్టేషన్ నిర్మించి రికార్డు స్థాయిలో విద్యుత్ సరఫరా చేసినందుకు గాను విద్యుత్ శాఖ అధికారులకు దేవస్థానం విద్యుత్‌శాఖ డీఈ సూర్యనారాయణ కృతజ్ఞతలు తెలియచేశారు. ఇది కేవలం టెక్నికల్ చార్జింగ్ మాత్రమేనని వచ్చేనెలలో అధికారికంగా మంత్రులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. టి.రామాసింగ్, టెక్నికల్ మెంబర్ పి.వేంకటరామారెడ్డి, ఫైనాన్స్ మెంబర్ పృథ్వీతేజ, ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ సూర్యప్రతాప్, డీఈ ఆపరేషన్స్ కె.రత్నాలరావు పాల్గొన్నారు.

పొలం మకాంలోకి దూసుకుపోయిన కారు

- ప్రమాదంలో ముగ్గురికి గాయాలు – లేగదూడ మృతి


ప్రమాద స్థలంలో నుజ్జు నుజ్జు అయిన కారు

గండేపల్లి: జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి పొలం మకాంలోకి దూసుకుపోయిన ఘటనలో ముగ్గురికి గాయాలు కాగా లేగదూడ మృతిచెందింది. ఆదివారం జరిగిన ఈ ఘటనపై స్థానికుల సమాచారం మేరకు ఎన్టీ రాజాపురానికి చెందిన బి.సూరిబాబు, మరుకుర్తి మంగతాయారు, సుబ్బయమ్మపేటకు చెందిన కర్రి రామకృష్ణ కారులో మల్లేపల్లి నుంచి రాజమహేంద్రవరం వెళుతుండగా గ్రామ శివారులో ముందు వెళుతున్న మోటార్ సైకిలిస్టును తప్పించే ప్రయత్నంలో కారు అదుపుతప్పి రోడ్డుకు సమీపంలో గల పొలం మకాంలోకి దూసుకుపోయి విద్యుత్ పోల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో విద్యుత్ పోల్‌కు కట్టి ఉన్న లేగదూడ అక్కడికక్కడే మృతి చెందగా కారు నుజ్జునుజ్జు అయింది. కారు నడుపుతున్న సూరిబాబుకు తీవ్ర గాయాలై కారులో ఇరుక్కుపోగా మంగతాయారుకు గాయాలయ్యాయి. రామకృష్ణ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. ఘటనా స్థలం వద్దకు చేరుకున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది వర కుమార్, సతీష్ స్థానికుల సహాయంతో రామకృష్ణను, మంగతాయారును 108 అంబులెన్స్‌లోను, కారులో ఇరుక్కున్న సూరిబాబును బయటకు తీసి హైవే అంబులెన్స్‌లోను రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని గండేపల్లి పోలీసులు తెలిపారు.

పరస్పర ఫిర్యాదులపై కేసుల నమోదు

మండపేట: అర్తమూరులో దాడి ఘటనకు సంబంధించి పరస్పర ఫిర్యాదుపై కేసులు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ బి. శివకృష్ణ తెలిపారు. చిర్ల వెంకటసత్యనారాయణరెడ్డి, మరో ఐదుగురు తనపై కత్తితో దాడిచేసి గాయపర్చినట్టు చిర్ల చంద్రశేఖర్‌రెడ్డి ఫిర్యాదు చేశారన్నారు. అలాగే చిర్ల చంద్రశేఖరరెడ్డి, మరో ఐదుగురు తనపై కత్తితో దాడి చేసినట్టు చిర్ల వెంకటసత్యనారాయణరెడ్డి ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆదివారం ఎస్ఐ శివకృష్ణ తెలిపారు.

సెల్ టవర్‌పై యువకుడి హల్‌చల్


సెల్ టవర్‌పై యువకుడు

మండపేట: పట్టణంలోని పశువుల ఆస్పత్రి సమీపంలోని సెల్ టవర్‌పై ఆదివారం సాయంత్రం యువకుడు హల్‌చల్ చేశాడు. స్థానికులు దీనిని గమనించి ఫొటో తీసి వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడంతో వైరల్ అయ్యింది. కొద్దిసేపటి తర్వాత యువకుడు టవర్ దిగిపోయి వెళ్లిపోయినట్టు చుట్టుపక్కల వారు తెలిపారు. కాగా యువకునిది మండలంలోని మారేడుబాక గ్రామంగా తెలిసింది. బాకీ చెల్లించినా తన మోటారు సైకిల్‌ను తాకట్టుదారుడు ఇవ్వక పోవడంతో ఆందోళన చెంది టవర్ ఎక్కినట్టు సమాచారం. తాకట్టుదారుడు మోటారు సైకిల్ ఇవ్వడంతో టవర్ దిగి వెళ్లిపోయినట్టు తెలిసింది.

దింపు కార్మికుడి దుర్మరణం

ముమ్మిడివరం: కొబ్బరి కాయల దింపు తీస్తుండగా చెట్టుపై నుంచి జారి పడి కార్మికుడు మృతిచెందాడు. మండలంలో కొమానపల్లి గ్రామానికి చెందిన లంక సత్యనారాయణ(50) ఆదివారం కొబ్బరితోటలో దింపు తీస్తుండగా అదుపు తప్పి పడిపోయి మృతి చెందాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొత్తపేట: ప్రమాదవశాత్తూ బాణసంచా మంటలకు కాలి గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు స్థానిక అదనపు ఎస్సై డి.శశాంక తెలిపారు. స్థానిక ఏనుగులమహల్ గ్రామానికి చెందిన సలాది ధనలక్ష్మి (45) గత నెల 29 న గత ఏడాది దీపావళికి మిగిలిపోయిన చిచ్చుబుడ్డిని వెలిగిస్తుండగా వ్యాపించిన మంటలకు కాలి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతి చెందినట్టు అదనపు ఎస్సై తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

నూకాంబిక అమ్మవారికి రజత త్రిశూలం సమర్పణ


రజత త్రిశూలం సమర్పిస్తున్న దాతలు

ఆలమూరు: చింతలూరు శ్రీనూకాంబిక అమ్మవారికి ఆదివారం కొత్తూరు సెంటర్లో శ్రీసీతారామ ఏజెన్సీస్ పెట్రోల్ బంకు అధినేత కొవ్వూరి భాస్కరరెడ్డి కుమార్తె దేవి చైతన్య, సీతారామరెడ్డి దంపతులు రూ.1.376 కేజీల వెండితో చేయించిన రూ.1.05 లక్షల విలువ చేసే రజత త్రిశూలం సమర్పించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు నామాల శ్రీనివాస్, చింతలూరు ఫణి, మార్గాని ఏసు, దేవస్థానం అధికారి భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

మామిడికుదురు: అదుర్రులో కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేశామని నగరం ఎస్సై పి.సురేష్ ఆదివారం తెలియజేశారు. కోడి పందేలు ఆడుతున్న వారిపై శనివారం సాయంత్రం దాడి చేసి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.1,650 నగదు స్వాధీనం చేసుకున్నామని, పందెం కోళ్లను పట్టుకున్నామని చెప్పారు. మండలంలో ఏ విధమైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని ఎస్సై హెచ్చరించారు.

63 మంది మహిళలకు బంగారు రూపులు

- గోకవరం దేవీచౌక్ ఆలయంలో లక్కీ డ్రా


మహిళలకు బంగారు రూపులు అందజేస్తున్న శ్రీనివాస్‌రావు, పద్మావతి దంపతులు

గోకవరం: గోకవరంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీ వ్రతాలు ఆచరించే మహిళలకు లక్కీడ్రా ద్వారా 63 మంది మహిళలకు ఒక్కొక్కరికీ గ్రాము బంగారు రూపులను అందజేశారు. గ్రామానికి చెందిన కంబాల శ్రీనివాస్‌రావు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆయన పలు సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా దేవీచౌక్ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించే మహిళలకు లక్కీడ్రా ద్వారా ఒక్కొక్కరికీ గ్రాము బంగారు రూపులు ఇస్తామని నెలరోజుల క్రితం ప్రకటించగా సుమారు 2,700 మంది మహిళలు రిజిస్టర్ చేసుకున్నారు. ఆదివారం గ్రామంలోని స్థానిక సూర్యఫంక్షన్ హాలులో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, అర్చకుల సమక్షంలో లక్కీ డ్రా తీశారు. లక్కీడ్రాలో గెలుపొందిన 63 మంది మహిళలకు కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతి దంపతులు బంగారు రూపులను అందజేశారు. లక్కీడ్రాకు రిజిస్టర్ చేసుకున్న మహిళలందరికీ పసుపు, కుంకుమ, జాకెట్టు, వంటి పూజా సామగ్రి కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరికీ కూడా గ్రాము బంగారు రూపులను విడతల వారీగా అందజేస్తామని ప్రకటించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి దాత సుమారు రూ.10 లక్షలు వరకు వెచ్చించారని కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ, మహిళలు పాల్గొన్నారు.

14 నుంచి రాష్ట్ర స్థాయి మినీ బ్యాడ్మింటన్ పోటీలు

మలికిపురం: స్థానిక శ్రీరామ బ్యాడ్మింటన్ అకాడమీ స్టేడియంలో వచ్చే నెల 14 నుంచి 17 వరకూ రాష్ట్ర స్థాయి 2023 మినీ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం, కోశాధికారి బెజవాడ వెంకట్ తెలిపారు. ఆదివారం టోర్నమెంట్ ఏర్పాట్ల సందర్భంగా కార్యదర్శి, కోశాధికారి, జాతీయ కోచ్ ఎస్.వీ.భద్రం స్థానిక స్టేడియంను పరిశీలించారు. అనంతరం వారు మీడియా సమావేశంలో టోర్నమెంట్ వివరాలు వివరించారు. దెందుకూరి సత్యనారాయణరాజు టోర్నమెంట్‌గా నిర్వహిస్తున్న దీనిలో అండర్-11 బాలుర, బాలికల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్‌లో పోటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనదలిచే క్రీడాకారులు వచ్చే నెల 7వ తేదీ లోగా తమ ఎంట్రీలను జిల్లా అసోసియేషన్ ద్వారా రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు పంపాలని సూచించారు. కాగా స్టేడియంలో క్రీడల నిర్వహణకు అవసరమయ్యే ఏర్పాట్లపై వారు స్థానిక కోచ్‌కు వివరించారు. స్థానిక అకాడమీ అధ్యక్షుడు దెందుకూరి రాంబాబు రాజు, మెంబర్ ముప్పర్తి సత్తిరాజు, పీఈటీ పెద్దిరాజు, అకాడమీ కోచ్ హరికృష్ణ పాల్గొన్నారు.